# అబ్దుల్ రజాక్ లారీ

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు

శ్రీల నడిమింట వెలుగొందు గోలకొండ
వైభవ సహస్రభానుగభస్తిచయము
జ్వాలదసూయాఖ్య భూతదర్పణము సొచ్చి
చిచ్చు రగిలించె నౌరంగజేబు మదిని.

మహితగుల్బర్గ సాధుసమాధిగూర్చి
వింతవింత వదంతులు వెల్లడించి
ప్రబల చతురంగబలముతో వచ్చి తాకె
నింతలో గోలకొండ డిల్లీశ్వరుండు

"నిర్దరుల మర్త్యులనుబోలె నెనరుగూర్చి
తురకలను హిందువుల నొక్క త్రోవ నడపి
కంటి "తానాశాహ" బిరుదు నిష్కంటకముగ
బాపు నీనేర్పు పొగడ నెవ్వని తరమ్ము?"

"కాఫరుల సుఖపెట్టుట కడిది వ్రతము
కులగురుడు రామదాసు, భక్తుల వలంతి;
భద్రగిరిరాము డిలువేల్పు భళి! సెబాసు;
ఎల్లవిధముల కృతివి నీకేమి కొదువ?"

"వైభవ మపారము; తెలుంగుబాపనయ్య
లనుగు ప్రెగ్గడ గమికాండ్రు; యవనజాతి
శత్రువు, మరాటి, శంభాజి సఖుడు నీకు
పరువుతక్కువ మాస్నేహబాంధవమ్ము"

"అనుగతుండను నేను మహమ్మదునకు;
ప్రభువు నానతి నాకు ప్రవర్తకమ్ము
వేడుకలు కట్టిపెట్టు నాతోడ; నిపుడు
రాయబారపుటాస వ్యర్థప్రయాస."

"మును ఖురేషుల రక్తవాహినులదోగి
పూత మైన మహమ్మదుచేతి కత్తి
జాతివిద్రోహ శోణితఝరుల బరపి
ధరణి తాపోష్మ బాపు నుద్ధతి చెలంగ."

ఈగతి జవా బొసంగె డిల్లీశ్వరుండు;
కురిసె నిప్పులవాన గోల్కొండనేత;
చల్లచల్లగ నేడుమాసములు చనియె
కరడుగట్టిన యోధరక్తమ్ము త్రొక్కి.

నిబ్బరించిన తానాశాహ నెమ్మనమ్ము
వ్రయ్యవారదు భీతివజ్రంపుహతికి;
ఆసగొన్న డిల్లీశు హృదంతరమ్ము
పగిలిపోదు నిరుత్సాహ పరశుహతికి.

ఆటలకుమారు వరవళ్లు; పాటబదులు
బిరుదుబొబ్బలు చెలరేగి విఘువకునికె
భోగలాలస లగు నెల్ల ముద్దరాండ్రు
బొమలు ముడిచిరి గోల్కొండపురము నందు.

బాపల వికాసముం గాంచి వగచువారి
కొండెములు విని తానాశాహ కూర్మిసతులు
కడగి యక్కన మాదన్నగార్ల శిరము
లరికి నజరులువెట్టి రత్యార్ద్ర లగుచు,

అపు డలంగీరు భేదతంత్రానుసరణి
కాంచనాద్రులు గాంచి దిగ్భ్రాంతు లగుచు
కొదువ గోల్కొండదళపతుల్ కుక్కలైరి
ఖాను డొక్కఁడు లారీ యొకండు దక్క.

పడియె తానాశాహ శిరమున పరశుధార,
కురిసె డిల్లీశు శిరమున కుసుమవృష్టి,
జరిగె నేతాముపెట్టుగ సంగరమ్ము
కడచె నొకనెల వాయువేగమున మరల.

హృదయ ముర్రూత లూగు టూహించి తెలిసి
ఆభిజాత్యమ్ము తేలిక యగుట కాంచి
కాంక్షపేరిటి జవరాలు ఖానువర్యు
చెంపపై గొట్టె బంగరుచెప్పుతోడ.

శత్రువుల ద్రుంచు చింతయు, సాటివీరు
డరుల గలిసిన వంతయు నవశు జేయ
నురికె హయ మెక్కి లారీ మహోగ్రు డగుచు
వైరివీరులు చీకాకుపడి కలంగ.

చేతి కందిన శిర మెల్ల చిదిమిచిదిమి
పొరలు నెత్తురుటేరుల మునిగిమునిగి
దర్పమున పీన్గుగుట్టలు దాటిదాటి
యేటి కెదు రీదు చేపనా నెసగె నతడు.

అరచి పైబడి డిల్లీశు నాజ్ఞనంది
విక్రమించిరి పదుగురు వీరు; లతని
కాయమున బ్రాకి వారల ఖడ్గలతలు
పూచె నెర్రని పూవులు ముమ్మరముగ.

అరుల నడుమ మనోగతి ననుసరించి
చినుకుతోడి సదాగతి ననుకరించి
మెలగుట నతండు గుర్రముమీద వ్రాలి
మించు ననురాగమున కౌగిలించుకొనియె.

తురగరింఖాసముద్భూతధూళిపటల
మెల్ల నడగార రేగి డిల్లీశుబలము
కృత్తవైరి శిరోఘట బృంద మెత్తి
చనియె మున్ముందు కలయంపి చల్లుకొనుచు.

అపు డలంగీరు బద్ధారినృపతి యగుచు
కడురయమ్మున గోల్కొండ గద్దె యెక్కె;
వాడవాడలు సొచ్చి తద్భటసహస్ర
మనుభవించెను స్వేచ్ఛావిహారసుఖము.

కల ధన మెల్ల ధనికులు కాన్కవెట్టి
ముక్తిబడసిరి విజ్ఞానపూర్ణు లగుచు;
చూచుచుండగ సుర లైరి సోమయాజు
లంబువులు చల్లి దీవించి రచటి సతులు.

ఆసమై నాస వర్జించి వాసిగన్న
యోధవరులకు బహుమతు లొసగునపుడు
తెచ్చి విడిచిరి భటు లరసచ్చియున్న
వ్రణితు డగు వీరు నొకని రారాజునెదుట.

మెరసె సభ చూడ్కు లాతని మేనినిండ
రేగె కోలాహలమ్ము లారీ యటంచు
వేపథువు మాటుకొనుచు పృథ్వీవిభుండు
గద్దె దిగి పిడి నుదు రంట కత్తిమెత్తె.

పదుపదుల గాయమ్ములతోడ నపుడు
సకరుణమ్ముగ రణవైద్యశాల సొచ్చి
ఒక్క నెల యుండి లారీ మహోదయుండు
వర్ధమాన సుధాంశుని పగిది వెడలె.

ఆసతో కబు రంపె రాజాధిరాజు
కొసలుసాగెడు భావియోచనలతోడ
ఈసుతో వచ్చె లారీ కరీంద్రుపోలె
నిజవిభునిమీద సుడిపెట్టు నెనరుతోడ.

గాటముగ రాలె నపుడు చెంగలువపూలు
కురిసె పీయూషబిందువుల్ కొసరికొసరి
మేటి గమికాంద్రతో నెకిమీంద్రతోడ
నలరు కొలువెల్ల కలగె మహాబ్ధిపోలె.

చూచియును జూడని విధాన లేచి నిలిచి
అందికొనినట్లు జోహారు లాచరించి
కరుణ చూపిన యట్టు లాదరము చూపి
పెద్దసేనాని కుడిదెస గద్దె చూపి.

"మిత్తినెదిరించి శౌర్యము గుత్తగొనిన
మేటి వీరుడు పొడచూపె నేటి" కనుచు
కొండ యెక్కించి రారాజు కోరె నతని
శంక వోనాడి డిల్లీ నలంకరింప.

కర మెసద సాని యెదురొమ్ము విరిచి నిలిచి
బొమలు ముడిచి దృగాశుగమ్ములను గ్రుమ్మి
మనసు గుబగుబలాడించి మారు పల్కె
కూలిపోయిన గోల్కొండ కూర్మిజోదు.

"ప్రాణములు నిల్పితివి నాదు ప్రణతి గొనుము
గెల్చికొంటివి రాజ్యలక్ష్మిని బడయుము
పెట్టిపుట్టినాడ వనుభవింపుము సిరి
కక్కురితిమాట లిక చాలు కట్టిపెట్టు".

"పిలువకుము నన్నునుద్యోగఫలము. చూపి
నాల్క యొక్కటినాకు డెందమ్ము నొకటి:
విడిచి గోల్కొండ వేరొకయెడకు చనుట
భంజనమునకొ కాకున్న స్వర్గమునకొ"

"ప్రాణముల నొడ్డి, రక్తస్రవంతు లీది
ప్రభువుతానాశాహ కొలువున పడసినాడ;
మొదలు సామ్రాజ్యరక్షణమునకు గాదు
శిక్షణమునకుగాని నా చేతి కత్తి.

"సుతునిపోలిక తానాశాహ చూచె నన్ను
చన వొసగి గౌరవము చేసి, ధనము గూర్చి;
క్షుద్రుడను నేను విజయమ్ము గూర్పనైతి
మీదుకట్టగ వలదె యీ మేని నైన?

"కత్తి విడిచి డిల్లీశుడు కాసు విసరె
చాలు గోల్కొండ కీగొప్ప; శాశ్వతమ్మొ
జీవనము? సొంతపురి జేరి చిత్రకథల
తేజరిలుమయ్య వేగ, సీరోజు నేడు;

మాట ముగియుట తడవుగ మరలిపోయె
జేత నుడికించి యతడు విజేతవోలె;
అరిగె నౌరంగజేబు దీనాస్యు డగుచు
విజితుని విధాన నవరాజ్యవిభుత గనియు.

